క్లుప్తంగా

ఇందిరా మహిళా శక్తి సంబరాలు

రఘునాథపాలెం: మండలంలోని వెంకటాయపాలెం రైతు వేదికలో బుధవారం గ్రామ సమైక్య ఆధ్వర్యాన ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు వడ్డీలేని రుణాలు, బీమా సౌకర్యాలు వంటి పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబర్చిన స్వయం సహాయక సంఘాలను సన్మానించారు.

నేటి చలో సెక్రటేరియట్‌కు తరలిరావాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రైవేట్ స్కూల్ ఫీజులను నియంత్రించాలని కోరుతూ చేపట్టిన చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలని ఆఫ్ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ కోరారు. నేలకొండపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున తలపెట్టిన నేడు(గురువారం) జరిగే చలో సెక్రటేరియట్‌తో ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు.

13న యోగ సంఘం మహాసభలు

ఖమ్మంలీగల్: ఈ నెల 13న నగరంలోని నెహ్రూనగర్ కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ యోగా సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఛీజీ, అడ్వకేట్ మరికంటి వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా కేజీ నుంచి పీజీ వరకు యోగ శాస్త్రాన్ని పాఠ్యాంశంగా పెట్టే మలి సంచిక ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. పూర్వపు యోగా సాధకులను తెలంగాణ యోగ విద్వాన్ అవార్డులతో సత్కరిస్తారని, సభను జయప్రదం చేయాలని కోరారు.

'సిరి మసూరి'కి గిరాకీ

నేలకొండపల్లి: సిరి మసూరి వరి విత్తనాలకు మంచి గిరాకీ ఉండడంతో బుధవారం స్థానిక డీలర్ వద్దకు జిల్లాలోని వైరా, కొణిజర్ల, మధిర ఇతర ప్రాంతాల నుంచి నేలకొండపల్లికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గత సీజన్‌లో దిగుబడి బాగా వచ్చిందని ఇప్పుడు కూడా రావడంతో పది కేజీల సంచీ రూ.1,150లకు విక్రయిస్తున్నారు. ఈసీజన్‌లో ఇక్కడి డీలర్ వద్ద నుంచి ఇప్పటివరకు దాదాపు 2 టన్నుల విత్తనాలు విక్రయించినట్లు సమాచారం.

రిక్కా బేజారు..!


రిక్కాబజార్‌లో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులు


అసంపూర్తిగా డ్రెయిన్ నిర్మాణం

నత్తనడకన రిక్కాబజార్ రోడ్డు వెడల్పు పనులు

- నాలుగు నెలల క్రితం ప్రారంభం
- అసంపూర్తి డ్రెయినేజీలతో రోడ్లపైకి మురుగు
- పైపులైన్లు పగిలి మంచినీరు వృథా
- అవస్థలు పడుతున్న స్థానికులు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని 25వ డివిజన్ రిక్కాబజార్‌లో రోడ్డు వెడల్పు పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభం కాగా నేటికీ పూర్తికాకపోవడంతో స్థానికులకు ఇబ్బంది పడుతున్నారు. తొలుత హడావిడిగా పనులు ప్రారంభమైన ఆతర్వాత నెమ్మదించడంతో రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్డుపైనే నీరంతా చేరుతుండడం గమనార్హం.

తగ్గుతున్న వెడల్పు..

నగరంలోని చర్చి కాంపౌండ్ నుంచి రిక్కాబజార్ వరకు ఈ రోడ్డు వెడల్పు పనులు కొనసాగుతున్నాయి. 33 అడుగుల మేర వెడల్పు చేయాల్సి ఉండగా.. కొన్ని చోట్ల తక్కువ వెడల్పుతో సరిపెడుతున్నట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో 30 నుంచి 32 అడుగులే వెడల్పు ఉంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతమంది సొంతంగా తొలగిస్తుండగా.. మరికొంతమంది తొలగించేందుకు అనేక కారణాలు చూపుతూ దాటవేస్తున్నట్లు సమాచారం.

దుర్వాసనతో అవస్థలు..

రోడ్డు వెడల్పు పనులు నిదానంగా సాగుతుండడం స్థానికులకు పరీక్షగా మారింది. రెండు వైపులా డ్రెయినేజీ కట్టాల్సి ఉండగా.. ప్రస్తుతం ఒక వైపు మాత్రమే పూర్తయింది. రెండోవైపు కట్టకపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఇక రాత్రి సమయాన దోమలతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు.


ముక్కు మూసుకుని వస్తున్న స్థానికులు

వృథాగా నల్లా నీళ్లు..

రోడ్డు వెడల్పు సమయాన అనేక నల్లాలు పగిలిపోయి నీళ్లు వృథాగా పోతున్నాయి. ఇక రెండో వైపు కట్టిన డ్రెయినేజీపై మూత లేకపోవడంతో వృద్ధులు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. అద్దంకిబజార్ నుంచి రిక్కాబజార్‌కు రావాలంటే గాంధీ పార్కు నుంచి చుట్టూ తిరిగిరావాల్సి వస్తుండగా.. వాహనాలు పూర్తిగా వెళ్లే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



రోడ్డు వెడల్పు పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. దీని కోసం ఇళ్ల వద్దనే ఉండాల్సి వస్తోంది. రోడ్డు వెడల్పు పనులు త్వరగా పూర్తి చేస్తే మాకు ఇబ్బందులు తప్పుతాయి. అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

– దోసపాటి నాగేశ్వరావు, స్థానికుడు

ఇబ్బంది పడుతున్నాం..



డ్రెయినేజీ రెండో వైపు నిర్మాణం పూర్తి కాక మురుగునీరంతా రోడ్డుపైకి వస్తోంది. దీంతో భరించలేని దుర్వాసన వస్తోంది. ఈ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. త్వరగా రెండో వైపు డ్రెయినేజీ నిర్మించాలి.

– వెంకటరావు, స్థానికుడు

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి


వనాన్ని పరిశీలిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. బుధవారం 8వ డివిజన్ బండపాలెం, బాలపేట ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. 8వ డివిజన్ వైస్సార్ కాలనీలో రెండెకరాల్లో ఏర్పాటు చేసిన వనాన్ని పరిశీలించాక, 46వ డివిజన్ రామాలయం వీధిలో రూ.11 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించే మురికి కాల్వ పనులకు శంకుస్థాపన చేశారు. 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు బాలగంగాధర్ తిలక్, ఇఇ కృష్ణలాల్, డీఈలు శ్రీనివాస్, ధరణికుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ రాధిక, ఏఈలు,నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నేలకొండపల్లి: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని ఈ నెల 14న ఖమ్మంలో నిర్వహించనున్న నేపథ్యాన బుధవారం వాటికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బౌద్ధక్షేత్రం వద్ద ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలో బుద్ధిస్టులు వెంకటేశ్వర్లు, తెల్లగొర్ల లింగస్వామి, చింతలపాటి భాస్కర్, బొడ్డు బాబురావు, కట్టెకోల చిన్నికృష్ణ, రామమూర్తి, కనకరావు, సైదా, ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం

కార్మిక, కర్షకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఈ సందర్భంగా వివిధ సంఘాల ఆధ్వర్యాన భారీ ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అధికారులకు అందించారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంలో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ర్యాలీ తీస్తున్న నాయకులు



ఖమ్మం మామిళ్లగూడెం: ప్రదర్శన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు


కామేపల్లి: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు


కూసుమంచి: ప్రదర్శనలో పాల్గొన్న భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు


ఖమ్మంరూరల్: వరంగల్ క్రాస్‌రోడ్డులో సీపీఐ నాయకుల నిరసన


రఘునాథపాలెం: మంచుకొండలో రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు


నేలకొండపల్లి మార్కెట్ వద్ద సమ్మె చేస్తున్న హమాలీలు


తిరుమలాయపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు


ఖమ్మంగాంధీచౌక్: నిరసనలో పాల్గొన్న బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

సమ్మెలో భాగంగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల నిర్దిష్ట డిమాండ్లపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్, ఎంప్లాయీస్ అసోసియేషన్, పెన్షనర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యాన బుధవారం బ్యాంకు రీజినల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.


ఖమ్మం బస్‌డిపోలో నిలిచిన బస్సులు

సంక్షిప్తంగా..

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వరి

నేలకొండపల్లి: బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్ఓ)లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని పాలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజేశ్వరి సూచించారు. మండల కేంద్రంలో బీఎల్‌ఓలకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించగా.. ఆమె మాట్లాడారు. వచ్చే నెల నుంచి దేశావ్యాప్తంగా జరిగే ఓటరు జాబితా ప్రక్షాళనపై అవగాహన కల్గి ఉండాలని, అందుకుస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీస్ పెద్ది జగన్నాథం, శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్‌రావు, అల్లం రవి, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మృతి


జాన్ లూయిస్

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని చర్చి కాంపౌండ్‌కు చెందిన సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు జాన్ లూయిస్ (80) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఒలంపిక్ ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారుడు బలరాం వద్ద శిక్షణ పొందిన ఆయన 1975 నుంచి 1985 మధ్య పలు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్లలో ఆడారు. జాన్ లూయిస్ మృతి పట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కుమార్, క్రీడాకారులు కబీర్ దాస్, ఐతం రవీందర్, గంగా ప్రసాద్, డాక్టర్ బి.వెంకన్న, రఘునందన్ సంతాపం తెలిపారు.

డివిజన్ అధ్యక్షుడికి సన్మానం..

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నూరుకాపు సంఘం 48వ డివిజన్ అధ్యక్షుడు శాబాసు రమణ పుట్టిన రోజు సందర్భంగా ఖమ్మంలోని తన స్వగృహంలో బుధవారం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకుల గాంధీ అధ్యక్షతన రమణ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం బాధ్యులు, నాయకులు తోట రామారావు, శీలంశెట్టి వీరభద్రం, పగడాల మోహన్‌రావు, ఆకుతోట రాజశేఖర్, పద్మం వెంకటేశ్వర్లు, పసుపులేటి చరణ్‌తేజ, దాసరి మధు, మేడి పవన్, ఆకుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు..

తిరుమలాయపాలెం: బచ్చోడు గ్రామానికి చెందిన గుగులోత్ సురేష్–భూమిక దంపతుల కుమార్తె గుగులోత్ హేమశ్రీ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం మధ్యాహ్నం అల్పాహారం ఏర్పాటు చేసి నోట్ పుస్తకాలు అందజేశారు. పాఠశాల హెచ్ఎం రజిని, గిరిజన పోరాట సమితి నాయకుడు రవి, వినోద్, వీరన్న, దేవ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి విద్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

కూసుమంచి: ప్రధాని నరేంద్ర మోదీ 11ఏళ్ల పాలనలో భాగంగా బుధవారం కూసుమంచిలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. పార్టీ రాష్ట్ర నాయకుడు దేవకి వాసుదేవరావు, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడ్డం వెంకటేశ్వర్లు, నాయకులు ఆదెపు మధు, గంజి ఉదయ్, సోమనపల్లి వెంకన్న, మంద రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిపై అవగాహన

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో వెదజల్లే విధానంపై ఏఓ భూక్యా తారాదేవి బుధవారం రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. నాటు వేసే విధానంతో కాక వెదజల్లే పద్ధతితో ఖర్చు తగ్గడంతో పాటు కూలీల సమస్య లేకుండా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన


ప్రమీలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పరంజ్యోతి

ఖమ్మం సహకారనగర్: ఇటీవల కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవంలో తమ కళాశాల విద్యార్థిని భుక్యా ప్రమీల బంగారు పతకాన్ని సాధించిందని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పరంజ్యోతి తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థిని అభినందించాక ఆమె మాట్లాడారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఎంఏ తెలుగు విభాగంలో ప్రమీల పతకాన్ని అందుకుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం హెచ్ఓడీ చేకూరి రమేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, గెస్ట్ లెక్చరర్లు శ్రీను, రామారావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తిరుమలాయపాలెం: మండలంలో ఇటీవల మృతిచెందిన కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక్కో కుటుంబానికి అందించిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని నాయకులు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డిలతో పాటు బెల్లం శ్రీనివాస్, అశోక్, మంగీలాల్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో 71 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు బుధవారం అందజేశారు. ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లుతో పాటు పూర్ణచంద్రరావు, జోనుబోయిన పాపయ్య, కోటేరు నర్సిరెడ్డి, గంగమ్మ, వెంకన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే మంచుకొండ గ్రామంలో 85 మంది లబ్ధిదారులకు మాజీ సర్పంచ్ వాంకుడోత్ విజయ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ నాయక్ ఆధ్వర్యాన ఇళ్ల పట్టాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రి తుమ్మల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తుళ్లూరి కృష్ణయ్య, గుండేటి నాగేశ్వరరావు, దొంతబోయిన సత్యనారాయణ, బానోత్ రాందాస్, భూక్య బద్రు నాయక్, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

యూనిటీ ఆఫ్ మాల ఆవిర్భావ వేడుకలు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని అంబేద్కర్ భవనంలో యూనిటీ ఆఫ్ మాల 5వ ఆవిర్భావ వేడుకలను ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ బాధ్యులు, నగర కార్పొరేటర్ బి.జీ క్లెమెంట్ మాట్లాడాక నూతనంగా ఎన్నికైన టీఎన్జీఓ రాష్ట్ర కార్యదర్శి జమ్మి జైపాల్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ఐఎంఏ సెక్రటరీ, న్యూరో సర్జన్ డాక్టర్ జగదీశ్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు టి.పవన్‌కుమార్‌లను జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు కందుల ఉపేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, స్టీరింగ్ కమిటీ బాధ్యులు యల్లయ్య, కనకయ్య, గోవింద్, మధు, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, సురేష్, శాంతయ్య, రవి, రామకృష్ణ, రమణ పాల్గొన్నారు.

నియామకం


రాజశేఖర్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం బిల్డర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి యూత్ (పీఎస్ఆర్ యూత్) నాయకుడు తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా ఆయనకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటితో పాటు క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, కమిటీ బాధ్యులకు రాజశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మున్నేరు ముంపు ప్రాంత ప్రజల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న డివిజన్ ప్రజలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మున్నేరు ముంపుప్రాంతాలైన 48వ డివిజన్ పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, గణేష్‌నగర్, సారథినగర్ ప్రాంత ప్రజలు బుధవారం బైపాస్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గోళ్లపాడు చానల్ ఆధునీకీకరణతో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మామిళ్లగూడెం ప్రాంతాల మీదుగా వచ్చే మురుగునీరు ఎఫ్‌సీఐ గోడౌన్ మీదుగా మళ్లించేలా చేస్తున్న కాల్వ నిర్మాణ పనులతో ఇప్పుడు పూర్తిగా తమ ఇళ్లు మునిగిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ తోట రామారావు మాట్లాడుతూ.. అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. డివిజన్ ఎక్స్ కౌన్సిల్ సభ్యుడు వంగాల వెంకట్, డివిజన్ అధ్యక్షుడు చేతి కృష్ణ, కిషన్ నాయక్, బాబా, కునుపూరి మహేష్, మధు, మోటే కుమార్, తోకల ప్రభాకర్, ఆకుల సత్యం, నిమ్మల నవీన్, గౌస్, చేతి శ్రీను, ఉపేందర్, ప్రభాకర్, సాగర్ గురుస్వామి, వీర స్వామి, నిర్వాసితులు పాల్గొన్నారు.